క్లుప్తంగా

పీహెచ్‌సీలో తనిఖీ



దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాశ్ సోమవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని హాజరు, ఓపీ, గర్భిణిలు, బాలింతల వివరాల రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు అందించాలని చెప్పారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఎప్పటికప్పుడు పరిస్థితిని మండల వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కిరణ్‌రాజ్, ఉద్యోగులు సాంబయ్య, రహమాన్, సబిత, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష



పర్వతగిరి : మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ శంకర్ నాయక్ సోమవారం సమీక్షించారు. భారీ వర్షాలకు చెరువులు, కుంటలు తెగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, డ్రైనేజీ కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, జనావాసాల్లో నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇళ్ల, వార్డుల వారీగా ఓటరు లిస్టు మ్యాపింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో మిగిలిన ప్లాంటేషన్ పనులు త్వరితగతిన చేపట్టాలని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, ఏపీఓ సునీల్ కుమార్, ఈసీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



రాయపర్తి : మండలంలోని కాట్రపల్లిలో విక్టరీ యూత్ క్లబ్ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గిరుక సురేశ్, ఉపాధ్యక్షుడిగా పిండిప్రోలు భిక్షపతి, కార్యదర్శిగా గాదె రాజు, కోశాధికారిగా గుండ్లపల్లి అశోక్, సభ్యులుగా గిరుక యాకయ్య, మొర్రి రాజేందర్, గుండపల్లి భాస్కర్, అశోక్, సతీశ్‌కుమార్, విష్ణు, సోమయ్య, యాకయ్య, ప్రసాద్, బుచ్చిరెడ్డి తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు సురేశ్‌ను కార్యవర్గం అభినందించింది.

పరామర్శ

నర్సంపేట : పట్టణానికి చెందిన టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్‌ను అతడి తండ్రి ఆనంద్ గతేడాది చనిపోయిన క్రమంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరామర్శించారు. తొలుత ఆనంద్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు..

నెక్కొండ : మండలానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ కొమండ్ల అనిల్‌రెడ్డి (శ్రీనివాస్‌రెడ్డి)ని అతడి తండ్రి ఉప్పలయ్య వర్ధంతి సందర్భంగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరామర్శించారు. తొలుత ఉప్పలయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే దొంతి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు రావుల హరీశ్‌రెడ్డి, పాలాయి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి



రాయపర్తి : ఎంసీపీఐ(యూ) నాయకుడు ఆరెల్లి ఎల్లయ్య (55) అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి మృతి చెందగా ఆయన మృతదేహానికి ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుమారస్వామి మాట్లాడారు. ఎల్లయ్య మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఎల్లయ్య ఆశయాలను కొనసాగిస్తామని చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సంతాపం వెలిబుచ్చారు. కార్యక్రమంలో నాయకులు గుగులోతు అరుణ్‌నాయక్, కాయిత వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

‘కుడా’లో విలీనం చేయొద్దు

ఆత్మకూరు : తమ గ్రామాన్ని కుడాలో విలీనం చేయొద్దని మండలంలోని కామారం గ్రామస్తులు మూకుమ్మడిగా తీర్మానం చేసి ప్రత్యేకాధికారి భాస్కరాచారికి సోమవారం అందించారు. కుడాలో విలీనం చేయడం వలన ఆర్థిక భారం పడుతుందని గ్రామస్తులు తెలిపారు.

వర్షానికి విరామం.. అధికారులు బిజీ



సంగెం : మత్తడి పోస్తున్న ఎల్గూర్‌రంగంపేట పెద్ద చెరువు



నెక్కొండ : కోతకు గురైన రహదారిని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్



పర్వతగిరి : ఏనుగల్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటస్వామి

సాక్షి నెట్‌వర్క్ : వర్షం సోమవారం విరామం ప్రకటించింది. రక్షిత, సహాయక చర్యల్లో అధికారులు మరింత బిజీ అయ్యారు. జిల్లాలోని నర్సంపేట, నల్లబెల్లి, ఖానాపురం, సంగెం, నెక్కొండ, పర్వతగిరి, తదితర మండలాల్లో ఇంకా జనజీవనం కుదుట పడలేదు. ఖానాపురం మండలంలోని పాఖాల సరస్సు 2.3 ఫీట్లతో మత్తడి పోస్తుండంతో నర్సంపేట నుంచి కొత్తగూడకు రాకపోకలు నిలిచిపోయాయి. తుంగబంధం కాల్వకు నాలుగు చోట్ల గండ్లు పడి పంటలు కొట్టుకుపోయాయి. ఎల్గూర్ రంగంపేట పెద్ద చెరువు మత్తడి పోస్తోంది. సంగెం మండలంలోని గొల్లపల్లి మహ్మద్ సాహెబ్ కుంట తూము వద్ద నీరు లీకవుతుండగా ఐబీ అధికారులు సందర్శించి మరమ్మతులు చేయించారు. నెక్కొండ మండలంలోని వట్టివాగు ఉధృతితో చంద్రుగొండ ప్రధాన రహదారి కొట్టుకుపోగా పెద్దకొర్పోలు లొట్ల వాగు ఉధృతితో రోడ్డు కోతకు గురైంది. పలుచోట్ల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీసు అధికారులు సందర్శించి రక్షిత చర్యలు చేపట్టారు. రాయపర్తిలోని రహదారిపై వరద ఉధృతిలో టూవీలర్ కొట్టుకుపోగా వ్యక్తిని గ్రామస్తులు కాపాడారు.

రుణమాఫీ కోసం రైతుల రాస్తారోకో



ధర్మారంలో రాస్తారోకో చేస్తున్న రైతులు

గీసుకొండ: రుణమాఫీ కోసం గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 16వ డివిజన్ ధర్మారం ఇండియన్ బ్యాంకు వద్ద సోమవారం వరంగల్–నర్సంపేట రహదారిపై రైతులు సోమవారం రాస్తారోకో చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా తమకు రుణమాఫీ కాలేదని, బ్యాంకు కేంద్ర కార్యాలయం వారి నిర్లక్ష్యం కారణంగా సుమారు 800 మందికి రుణమాఫీ వర్తించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు జాబితాను ప్రభుత్వానికి పంపడం వల్లే తమకు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. 2014 నుంచి ప్రతీ సంవత్సరం రుణం తీసుకుని చెల్లిస్తున్నా తమకు రుణమాఫీ రాలేదన్నారు. వెంటనే సరైన జాబితా తయారు చేసి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులకు విన్నవిస్తామని చెప్పారు. అనంతరం బ్యాంకు మేనేజర్ రవీందర్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. రైతుల ఆందోళనకు బీసీ ప్రజాసంఘాల రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్, రైతు సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు ఊరటి అంశాలరెడ్డి, పేరుపల్లి రవి సంఘీభావం తెలిపారు. రాస్తారోకోలో రైతులు కొట్టి ముత్తిలింగం, బొల్లం విద్యాసాగర్, గోదాసి రమేశ్, గోలి రాజయ్య, గౌరయ్య, గోదాసి రాజు, ముస్కు కోటయ్య, బైకని కొంరయ్య, బొల్లం పెంటయ్య పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దుగ్గొండి : మండలంలోని గిర్నిబావి గ్రామంలోని చైతన్య విద్యాలయలో 2003–04 విద్యాసంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన విద్యార్థులు ఆ స్కూల్ ఆవరణలో సోమవారం సమ్మేళనం నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల తర్వాత అందరూ కలుసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఒకరిని మరొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం నాడు తమకు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులు బైరెడ్డి రాజేందర్‌రెడ్డి, బొనగాని రవీందర్, పరుపాటి రఘోత్తంరెడ్డి, నాంపల్లి కొమురయ్య, బైరెడ్డి సుఖజీవన్‌రెడ్డిలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు తోకల రాజేశ్వర్‌రెడ్డి, కొనకటి రాజేందర్, కూరంగడ్ల శ్రీకాంత్, చెన్నాల సుమన్, సతీశ్, రాజ్‌కుమార్, రజిత, కల్యాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుతో పార్టీ బలోపేతం



నియామక పత్రాలు అందజేస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి

నల్లబెల్లి : సభ్యత్వ నమోదుతో బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో అత్యధిక సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీగా బీజేపీని కీర్తించారు. ఒక్కో బూత్ పరిధిలో 200లకు తగ్గకుండా నూతన సభ్యత్వాలు నమోదు చేయాలని సూచించారు. కనీసం 100 సభ్యత్వాలు చేయించిన వారికి మాత్రమే పార్టీ క్రియాశీలక సభ్యత్వం లభిస్తుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని చెప్పారు. అనంతరం పార్టీ మండల కార్యవర్గాన్ని ప్రకటించి నియామక పత్రాలు అందజేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, జిల్లా కార్యదర్శులు అశోక్‌గౌడ్, రాధాకృష్ణ, వినయ్, కోటి, మండల ప్రధాన కార్యదర్శులు వినయ్‌గౌడ్, వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, అశోక్, కృష్ణమూర్తి, కార్యదర్శులు రమేశ్, రవీందర్, నాగరాజు, రాజిరెడ్డి, పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం



కూలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

రాయపర్తి : ఎడితెరిపి లేని వర్షాల కారణంగా పంటలు, ఆస్తులు, పాడి సంపద నష్టపోయిన వారికి అండగా ఉంటామని తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కాట్రపల్లిలో భారీ వర్షాల కారణంగా ఇళ్లు కూలి నష్టపోయిన గుర్రపు సమ్మయ్య, ముప్పిడి ఎల్లయ్యలను కాంగ్రెస్ నాయకులు సోమవారం కలిసి పరామర్శించారు. నష్ట తీవ్రతను అధ్యయనం చేశారు. అనంతరం హామ్యానాయక్, రవీందర్‌రెడ్డి మాట్లాడారు. వర్షాలకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఆర్థిక సాయం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలో బుంగపడిన మత్తడిని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో నాయకులు కృష్ణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఏసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, గుగులోతు యాకూబ్, మచ్చ రమేశ్, మూనావత్ రవి, తదితరులు పాల్గొన్నారు.

నష్ట నివారణకు చర్యలు చేపట్టాలి



గాంధీనగర్‌లో భోజనం అందజేస్తున్న నాయకులు

వరంగల్: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వలన వేలాది గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయని, ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల భిక్షపతి, గౌని ఐలయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాచర్ల బాలరాజు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక చెరువులు తెగిపోయి వేలాది ఎకరాల పంట భూములు కోతకు గురయ్యాయని పేర్కొన్నారు. ప్రధానంగా మహబూబాబాద్, ములుగు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జనగామ, లాంటి జిల్లాల్లో భారీగా పంట నష్టం సంభవించిందని వివరించారు.

ముంపు బాధితులకు భోజనాల పంపిణీ

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్‌లో ముంపునకు గురైన గాంధీనగర్ బాధితులకు బల్దియా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో పునరావాసం కేంద్రం ఏర్పాటు చేసి భోజనాలు అందజేశారు. అధికారులు, నాయకులు.. సోమవారం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం పెట్టారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపు

దుగ్గొండి : ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేస్తామని ఏఓ బానోతు మాధవి తెలిపారు. మండలంలోని నాచినపల్లి గ్రామంలో రేషన్ కార్డులు లేని రైతుల వివరాలను యాప్‌లో ఆమె సోమవారం నమోదు చేసి మాట్లాడారు. మండలంలోని నాచినపల్లి గ్రామంలో రేషన్‌కార్డు లేని రైతుల వివరాలను సోమవారం యాప్‌లో నమోదు చేశారు. రైతులు ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని చెప్పారు. రేషన్ కార్డు లేని, ఆధార్ లింక్, పేర్లు తప్పుగా నమోదు కావడం లాంటి సమస్యలను పరిష్కరించేలా సమగ్ర వివరాలను ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో పకడ్బందీగా నమోదు చేస్తున్నట్టు తెలిపారు. వివరాలను సంబంధిత బ్యాంకుల్లో సరి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు హన్మంతు, విజయ్ పాల్గొన్నారు.



సంగెం: మందులు ఇస్తున్న డిప్యూటి డీఎంహెచ్‌ఓ



ఖానాపురం : పరీక్షలు చేస్తున్న డాక్టర్ కల్పన

వ్యాధులతో అప్రమత్తంగా ఉండండి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు



గీసుకొండ:జ్వర పీడితులను పరీక్షిస్తున్న వైద్యులు

సంగెం : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గోపాల్‌రావు కోరారు. మండలంలోని పోచమ్మతండాలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని చెప్పారు. తొలుత పలువురిని వైద్యులు పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ మోహన్ సింగ్, మండల వైద్యాధికారి డాక్టర్ వంశీ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని రంగాపురంలో నిర్వహించిన వైద్యశిబిరంలో రోగులను డాక్టర్ కల్పన పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు రజిత, జ్యోతి, ఆశ కార్యకర్తలు సంధ్య, సుమలత, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : మండలంలోని హర్జ్యాతండాలో నిర్వహించిన వైద్యశిబిరంలో జ్వర పీడితులకు డెంగీ, మలేరియా పరీక్షలు చేసి రక్త నమూనాలను సేకరించారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు దేవేందర్, మమత, సీహెచ్‌ఓ మధుసూదన్ రెడ్డి, ఏఎన్‌ఎం సదాలక్ష్మి, సుహాసిని, హెచ్‌ఏ శ్రీనివాస్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లిలో జన వికాస సంస్థ ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన వైద్యశిబిరంలో పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇల్లంద మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముద్రబోయిన వెంకన్న, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాశం సరోత్తంరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గజవెల్లి అనంతప్రసాద్, వశపాక ఎల్లయ్య, కుమార్, రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంతోష్, హాస్పిటల్ వైద్యుల బృందం, ఏఎన్‌ఎం ఎండీ రజియా, ఆశాకార్యకర్తలు వశపాక రాధ, మంజుల, బాల వికాస ప్రతినిధులు పిట్టల రాణి, అనురాధ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

నర్సంపేట : కల్లుగీత కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలో గోపగాని వెంకట్‌గౌడ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. గీత కార్మికులదరికీ సేఫ్టీ మోకులు అందించడంతోపాటు తాటి, ఈత వనాలను పెంచడానికి ప్రభుత్వ భూమి కేటాయించాలని, యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలో 2023లో నాటి ప్రభుత్వం రూ.7 కోట్ల వ్యయంతో నెలకొల్పిన నీరా ప్రాసెసింగ్ యూనిట్ పనులు పూర్తయి ఏడాది గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని సర్వాయిపేట పంచాయతీ పరిధిలోని కొమ్ము గుట్టకు నిధులు కేటాయించి పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరారు. గౌడ కులస్తులు రాజకీయాలకు అతీతంగా ఐక్యతతో పోరాడి హక్కులు సాధించుకోవాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు సోల్తి సారయ్య, శీలం వీరన్న, మద్దెల సాంబయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పంజాల వెంకట్, డివిజన్ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాంపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా మహానేతకు ఘన నివాళి



వర్ధన్నపేట : వైఎస్‌ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు



పర్వతగిరి : నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

సాక్షి నెట్‌వర్క్ : ప్రజానాయకుడిగా, సీఎంగా ఎనలేని సేవలు అందించి ప్రజాహృదయాల్లో మహానేతగా నిలిచిపోయిన వైఎస్‌ఆర్ 15వ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరూరా వైఎస్‌ఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు ఆయా మండలాల్లో నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, కేఆర్.నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, తదితర నాయకులు ఘనంగా నివాళులర్పించారు. బడుగు, బలహీనవర్గాలకు వైఎస్‌ఆర్ అందించిన సేవలను ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు స్మరించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ప్రతినబూనారు.



దుగ్గొండి : తిమ్మంపేటలో..



సంగెం : నివాళులర్పిస్తున్న నాయకులు



నర్సంపేట : నివాళులర్పిస్తున్న శాంతికుమార్

పంచాయతీ కార్యదర్శిపై ఎంపీడీఓకు ఫిర్యాదు



ఖానాపురం : బర్త్ సర్టిఫికెట్ జారీ చేయడంలో పంచాయతీ కార్యదర్శి ఇబ్బంది పెడుతున్నారంటూ ఎంపీడీఓ భారతికి రంగాపురం గ్రామానికి చెందిన ఎర్రబెల్లి శ్రీనివాస్‌రావు ఫిర్యాదు చేశారు. ఇంటి పన్ను చెల్లిస్తేనే సర్టిఫికెట్ ఇస్తామని తిరకాసు పెడుతున్నారని వాపోయారు. ఏటా ఉగాది తర్వాతే పన్నులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోందని, ఈసారి పిల్లల బర్త్ సర్టిఫికెట్ కోసం వెళితే పన్ను చెల్లిస్తేనే సర్టిఫికెట్ జారీ చేస్తానంటూ ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. సర్టిఫికెట్లు జారీ చేయడంలో ప్రజలను ఇబ్బంది పెడుతున్న క్రమంలో పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను కోరారు. పంచాయతీ కార్యదర్శి విధి నిర్వహణలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

కోనారెడ్డి చెరువు పరిరక్షణకు చర్యలు

- డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ



సమావేశంలో మాట్లాడుతున్న స్వర్ణ

వర్ధన్నపేట : మండలంలోని కోనారెడ్డి చెరువును పరిరక్షిస్తామని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తెలిపారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వాలు కోనారెడ్డి చెరువు అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నాయని ఆరోపించారు. నాలుగేళ్ల క్రితం చెరువు కట్ట తెగి భారీ నష్టం వాటిల్లిందని గుర్తు చేశారు. కట్ట పనులు పూర్తి అవుతున్న ప్రస్తుత తరుణంలోనే రెండు రోజులు కురిసిన ఎడతెరిపి లేని వర్షానికి చెరువు కట్టకు బుంగలు పడగా ఎమ్మెల్యే నాగరాజుతో కలిసి తాను సందర్శించినట్టు తెలిపారు. చెరువు అభివృద్ధికి రూ.110 కోట్లతో పనులు చేపట్టడానికి ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. చెరువు పరిధిలోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ప్రైవేట్ పట్టాలున్నా చెరువుకు ఆటంకం కలిగే పనులు చేపడితే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్టు తెలిపారు. అధికారులు సర్వే చేయించి చెరువును కాపాడాలని కోరామన్నారు. దేవాదుల పనులు పూర్తి చేస్తామని ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించిన క్రమంలో ఉప్పుగల్లు రిజర్వాయర్ నుంచి ధంసా చెరువులోకి ఉపకాల్వ నుంచి కోనారెడ్డి చెరువులో రిజర్వాయర్‌గా మారే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. సమావేశంలో నాయకులు అఫ్సర్, కుమారస్వామి, షబ్బీర్, మంజూర్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

తొర్రూరు రూరల్ : భారీ వర్షాలతో పంటలు, ఆస్తి నష్టపోయిన వారిని బాధితులను ఆదుకుంటామని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపురం, నాంచారీమడూరు, తొర్రూరు గ్రామాల శివారులో పాడైన వరి, బొప్పాయి, మొక్కజొన్న, పెసర, పత్తి వంటి పంటలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

గూడూరు : అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో కురివింద యాకలక్ష్మి, గట్టిపెల్లి వినోదల ఇంటి గోడలు కూలిపోయాయి. విషయం తెల్సుకున్న డీటీ కోమల గట్టిపెల్లి వినోద ఇంటికి వెళ్లి నష్టపరిహారం అందించే ఏర్పాటు చేస్తానన్నారు. కాంగ్రెస్ నాయకులు బాధితురాలికి కొంత నగదును అందించారు.